

# విభారే
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY




PUBLISHED FROM KURNOOL | ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి | గురువారం | 25-12-2025 | సంపుటి : 07 | సంచిక 226 | పేజీలు : 8 | వెల : రూ 3-00




# అంతరిక్షంలో ఇస్రో మరో ఘనత..

## 6100 కిలోల భారత 'బాహుబలి రాకెట్' సక్సెస్

నెల్లూరు, డిసెంబర్ 24,అంతరిక్ష రంగంలో ఇస్రో మరో ఘనత సాధించింది. భారత బాహుబలి రాకెట్ ప్రయోగాన్ని విజయవంతంగా ప్రయోగించింది. స్వదేశీ పరిజ్ఞానంతో తయారు చేసిన ఈ వాహకనౌక.. అమెరికాకు చెందిన బ్లూబర్డ్ బ్లాక్-2 ఉపగ్రహాన్ని నింగిలోకి తీసుకెళ్లింది. ఈ శాటిలైట్ ప్రపంచవ్యాప్తంగా టెలికాం రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురానుంది. ఇక భారత గడ్డపై ప్రయోగించిన అత్యంత బరువైన ఉపగ్రహంగా ఇది నిలిచింది.అంతరిక్షంలో ఇస్రో మరో ఘనత.. 6100 కిలోల భారత 'బాహుబలి రాకెట్' సక్సెస్భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ( ఇస్రో).. మరో అద్భుత ఘనతను తన ఖాతాలో వేసుకుంది. స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన అత్యంత శక్తివంతమైన బాహుబలి రాకెట్ (ఎల్‌వీఎం3-ఎం6) (ఒఎ౮3-౮6) ద్వారా బుధవారం ఉదయం అమెరికాకు చెందిన బ్లూబర్డ్ బ్లాక్-2 భారీ ఉపగ్రహాన్ని విజయవంతంగా కక్ష్యలో ప్రవేశపెట్టింది. ఆంధ్రప్రదేశ్ శ్రీహరికోటలోని సతీష్ ధవన్ స్పేస్ స్టేషన్ రెండో ప్రయోగ వేదిక నుంచి బుధవారం ఉదయం 8:55 గంటలకు ఈ ప్రయోగం చేపట్టారు.అమెరికాకు చెందిన ఏఎస్‌టీ స్పేస్‌మొబైల్ తయారు చేసిన 6,100 కిలోల బరువు ఉన్న ఈ బ్లూబర్డ్ బ్లాక్-2 శాటిలైట్‌ను.. భారత స్వదేశీ టెక్నాలజీతో రూపొందించిన ఎల్‌వీఎం3-ఎం6 వాహకనౌక.. నింగిలోకి తీసుకెళ్లింది. భారత గడ్డ మీది నుంచి ప్రయోగించిన అత్యంత బరువైన ఉపగ్రహంగా ఇది రికార్డు సృష్టించింది.

బ్లూబర్డ్ శాటిలైట్ ప్రత్యేకతలు

ఈ బ్లూబర్డ్ శాటిలైట్.. ప్రపంచవ్యాప్తంగా టెలికాం రంగంలో పెను మార్పులను తీసుకురానున్నట్లు ఇస్రో వర్గాలు వెల్లడించాయి. ఇక ఎలాంటి స్పెషల్ డివైజ్‌లు పరికరాలు లేకుండానే సాధారణ స్మార్ట్‌ఫోన్‌లకు నేరుగా అంతరిక్షం నుంచి 4జీ, 5జీ బ్రాడ్‌బ్యాండ్ సేవలను ఈ బ్లూబర్డ్ శాటిలైట్ అందిస్తుంది. ఇది అంతరిక్షంలో దాదాపు 2400 చదరపు అడుగుల విస్తీర్ణంలో తన యాంటెన్నాలను కలిగి ఉంటుంది. ఇది భూమికి దిగువ కక్ష్యలోనే అతిపెద్ద కమర్షియల్ కమ్యూనికేషన్ వ్యవస్థ కావడం విశేషం.


90 సెకన్ల జాప్యం ఎందుకు?

షెడ్యూల్ ప్రకారం ఉదయం 8:54 గంటలకే ఈ ప్రయోగం జరగాల్సి ఉంది. కానీ ఇది 90 సెకన్ల పాటు ఆలస్యమైంది. అంతరిక్షంలో అప్పటికే తిరుగుతున్న ఇతర ఉపగ్రహాలు లేదా శకలాలతో ఢీకొనే ప్రమాదం ఉందని గుర్తించిన ఇస్రో శాస్త్రవేత్తలు.. ముందు జాగ్రత్తగా ఈ ప్రయోగాన్ని కొద్దిసేపు వాయిదా వేసి 8:55:30 గంటలకు రాకెట్‌ను నింగిలోకి పంపించారు.భారత బాహుబలి రాకెట్ నింగిలోకి విజయవంతంగా చేరడంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. భారత అంతరిక్ష రంగంలో ఇదొక గొప్ప మైలురాయి అని అభివర్ణించారు. ఆత్మనిర్భర్ భారత్ స్ఫూర్తికి ఇది నిదర్శనమని.. భారత శాస్త్రవేత్తల కృషి గర్వకారణమని కొనియాడారు. ఇది ఎల్‌వీఎం3 రాకెట్ మూడో పూర్తి వాణిజ్య ప్రయోగమని.. ఇస్రో ఛైర్మన్ డాక్టర్ వి. నారాయణన్ వెల్లడించారు. 52 రోజుల స్వల్ప వ్యవధిలోనే 2 భారీ ప్రయోగాలను చేపట్టడం.. ఇస్రో సామర్థ్యానికి నిదర్శనమని పేర్కొన్నారు.



నవంబర్ 2వ తేదీన సీఎంఎస్-03 (అఓూ-03) ప్రయోగాన్ని చేపట్టింది. ఇదే ఎల్‌వీఎం3 రాకెట్ గగన్‌యాన్ మిషన్‌కు కూడా పునాది అని ఇస్రో ఛైర్మన్ తెలిపారు.ఈ ఎల్‌వీఎం3 రాకెట్ 43.5 మీటర్ల ఎత్తు.. 640 టన్నుల బరువు కలిగి ఉంటుంది. ఈ రాకెట్‌లో మూడు ఇంజిన్లు ఉంటాయి. మొదటి దశలో ఘన, రెండో దశలో ద్రవ, మూడో దశలో క్రయోజెనిక్ ఇంజిన్లు ఉంటాయి. గతంలో వన్‌వెబ్ ఉపగ్రహాలను మోసుకెళ్లిన రికార్డును అధిగమించి.. ఇప్పుడు 6.1 టన్నుల భారంతో అగ్రస్థానంలో నిలిచింది

# బాహుబలి రాకెట్ ప్రయోగం సక్సెస్.. మోదీ రియాక్షన్



న్యూఢిల్లీ, డిసెంబర్ 24: శ్రీహరికోటలోని సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ నుంచి బుధవారం ప్రయోగించిన బాహుబలి రాకెట్ ఎల్‌వీఎం3- ఎం6 ప్రయోగం విజయవంతమైంది. అమెరికాకు చెందిన అధునాతన కమ్యూనికేషన్ ఉపగ్రహం బ్లూ బర్డ్ బ్లాక్ 2 ను ఇస్రో విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. ఈ ప్రయోగం విజయవంతం కావడంపై దేశంలోని పలువురు ప్రముఖులు స్పందించారు. ప్రధాని నరేంద్ర మోదీ, ఏపీ సీఎం చంద్రబాబు, విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ తమ ఎక్స్ ఖాతాల వేదికగా వేర్వేరుగా స్పందించారు.ప్రధాని మోదీ స్పందిస్తూ.. భారతదేశ యువత శక్తితో.. మన అంతరిక్ష రంగం మరింత అభివృద్ధి చెందుతోందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఇది ప్రభావవంతంగా మారుతోందని ఆయన ఆకాంక్షించారు. ఎల్‌వీఎమ్ 3 నమ్మకమైన హెవీ లిఫ్ట్ పనితీరును కనబరుస్తుందన్నారు. గగన్‌యాన్ వంటి భవిష్యత్ మిషన్ల కోసం బలమైన పునాదులు వేస్తున్నామని తెలిపారు. అలాగే వాణిజ్య ప్రయోగ సేవలను సైతం విస్తరిస్తున్నామని పేర్కొన్నారు. ప్రపంచ భాగస్వామ్యంతో ముందుకు వెళ్తున్నామని చెప్పారు. ఇది భవిష్యత్తు తరాల సామర్థ్యంతోపాటు స్వావలంబను మరింత బలోపేతం చేస్తుందని ప్రధాని మోదీ ధీమా వ్యక్తం చేశారు.

**ఇస్రో బృందానికి అభినందనలు: సీఎం చంద్రబాబు**

శ్రీహరికోట నుంచి ఎల్‌వీఎమ్3- ఎమ్6ను బుధవారం ఇస్రో విజయవంతంగా ప్రయోగించింది. ఈ సందర్భంగా ఇస్రో బృందానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుభాకాంక్షలు తెలిపారు. యూఎస్ కమ్యూనికేషన్ ఉపగ్రహం బ్లూబర్డ్ బ్లాక్ 2 మోసుకెళ్లి.. అందుకు నిర్దేశించిన కక్ష్యలో ఈ ఉపగ్రహం ఉంచిందన్నారు. భారత్ నేలపై నుంచి ఇప్పటి వరకు అత్యంత బరువైన ఉప్రగ్రహాన్ని ప్రయోగించ లేదని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. తాజాగా ఈ ఉపగ్రహాన్ని ప్రయోగించడం ద్వారా మన దేశ వాణిజ్య అంతరిక్ష సామర్థ్యం, ప్రపంచ ప్రయోగ భాగస్వామిగా దాని స్థానాన్ని మరింత బలోపేతం చేస్తుందని తెలిపారు. ఈ అద్భుతమైన మిషన్ విజయానికి దోహదపడిన శాస్త్రవేత్తలు, ఇంజనీర్లకు ఇలా ప్రతి ఒక్కరికీ సీఎం చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు.

**ఇది ముఖ్యమైన అడుగు: మంత్రి నారా లోకేశ్**

బాహుబలి రాకెట్ అని పిలువబడే ఎల్‌వీఎమ్3 – ఎమ్ రాకెట్‌ను శ్రీహరికోట నుంచి ఈ రోజు విజయవంతంగా ప్రయోగించినందుకు భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో)లోని శాస్త్రవేత్తలు, సిబ్బందికి రాష్ట్ర ఐటీ విద్య శాఖ మంత్రి లోకేశ్ హృదయపూర్వక అభినందనలు తెలిపారు. భారతదేశ వాణిజ్య ప్రయోగ సామర్థ్యాలను ప్రపంచం ఎదుట ప్రదర్శించడానికి ఇది ఒక ముఖ్యమైన అడుగుగా ఆయన అభివర్ణించారు. రానున్న రోజుల్లో ఇస్రో మరిన్ని విజయాలు సాధించుకోవాలని కోరుకుంటున్నట్లు మంత్రి లోకేశ్ ఆకాంక్షించారు.

# ఇప్పటంలో పవన్ పర్యటన

గుంటూరు డిసెంబర్ 24, ఇచ్చిన మాట ప్రకారం.. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ బుధవారం నాడు గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం ఇప్పటంలో పర్యటించారు.వైసీపీ హయాంలో రోడ్డు విస్తరణ పేరుతో ఇప్పటంలో ఇండ్ల నాగేశ్వరమ్మ ఇళ్లు సహా పలువురి ఇండ్లను కూల్చివేశారు. జనసేన సభకు భూములు ఇచ్చారన్న కారణంతో కూల్చివేశారని ఆరోపణలుసైతం ఉన్నాయి.అప్పట్లో పవన్ కల్యాణ్ ఇప్పటంలో పర్యటించి బాధితులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఇండ్ల నాగేశ్వరమ్మ అనే వృద్ధురా కోరడంతో ఎన్నికల్లో నెగ్గాక మళ్లీ వస్తామని పవన్ కళ్యాణ్ హామీ ఇచ్చారు.గతంలో ఇచ్చిన మాట ప్రకారం డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ బుధవారం ఇప్పటంలో పర్యటించారు.

# మెగా మార్ట్ ప్రాంతంలో ట్రాఫిక్ క్లియర్--

## ట్రాఫిక్ సీఐ చాన్ బాషా ఆధ్వర్యంలో చర్యలు--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబర్ 24-నంద్యాల పట్టణంలోని మెగా మార్ట్ ప్రాంతం తో పాటు పరిసర ప్రాంతాల్లో ఏర్పడుతున్న ట్రాఫిక్ రద్దీని నివారించేందుకు ట్రాఫిక్ సీఐ చాన్ బాషా ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు చేపట్టారు.ట్రాఫిక్ సీఐ చాన్ బాషా తన సిబ్బందితో కలిసి రహదారులపై అడ్డంగా నిలిపిన వాహనాలను తొలగించి ట్రాఫిక్‌ను సజావుగా నడిచేలా చర్యలు తీసుకున్నారు. వాణిజ్య ప్రాంతాల్లో వాహనాల అక్రమ పార్కింగ్ వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని లోనే నియంత్రణ చర్యలు చేపట్టారు.ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ చాన్ బాషా మాట్లాడుతూ ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు తప్పకుండా పాటించాలని, అనుమతించిన ప్రదేశాల్లోనే వాహనాలను నిలిపివేయాలని సూచించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే విధంగా వ్యవహరించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.ట్రాఫిక్ సిబ్బంది కృషితో మెగా మార్ట్ ప్రాంతంలో వాహనాల రాకపోకలు సజావుగా కొనసాగుతున్నాయని స్థానికులు తెలిపారు.




# రేపు సూర్య దేవాలయంలో మన్యుసూక్త హోమం.

విభారే న్యూస్ డిసెంబర్ 24 కర్నూలు జిల్లా ప్రతినిధి..శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామిజీ వారి అపార కృపా ఆశీస్సులతో శ్రీ సూర్యనారాయణ స్వామి దేవాలయం నందుశుక్రవారం 26 డిసెంబర్ 2025.ఉదయం 10:00 గంటలకు.శ్రీ మన్యు సూక్తం హోమ:మన్యు సూక్తం అనేది ఋగ్వేదోక్తమైనఅత్యంత శక్తివంతమైన గూఢ సూక్తముగా శాస్త్రాలలో ప్రసిద్ధి."మన్యు" అనగా అంతర్గత శక్తి, ధైర్యము, ధర్మబలము.ఈ హోమము ద్వారా మనసులోనిభయం, నిరాశ, అపజయ భావనలు శుద్ధి చేయబడుతాయి.నరదృష్టి, నరబాధ, నరగోష వలన కలిగేఅశాంతి, అడ్డంకులు, అపవాద ప్రభావాలువేదాగ్నిలో దగ్ధమై నశించునని శాస్త్రోక్త నమ్మకం.దీర్ఘకాలంగా వెంటాడేశని దోషము, ముఖ్యంగా ఏలినాటి శని ప్రభావంమన్యు సూక్తం హోమము వలన శాంతింపబడును.ఈ హోమముకోపాన్ని నియంత్రించి ధైర్యంగా మారుస్తూవిజయానికి అనుకూలమైన శక్తిని ఉద్భవింపజేస్తుంది.ఈ హోమము చేయించుకొనుట వలన కలుగు శుభఫలితాలు:నరదృష్టి, నరబాధ, నరగోష నివారణ.ఏలినాటి శని, శని దోషము శాంతి.మానసిక అశాంతి, భయాలు తొలగింపు.శత్రు బాధలు, అపవాదాల నుండి రక్షణ.అపమృత్యు ? పరమృత్యు దోష నివారణ.కార్యాలలో స్థిరత్వం, ధైర్యం, విజయం.ఈ హోమము జరిగే నక్షత్రానికి అధిపతి.గురుదేవుడు (బృహస్పతి) కావునగురుబలము విశేషంగా వృద్ధి చెందుతుంది.విద్యార్థులు, ఉద్యోగార్థులు, వ్యాపారస్తులకుఈ హోమము విశేష శుభఫలితాలను అందిస్తుంది.హోమ వివరాలు:శ్రీ మన్యు సూక్తం హోమము ? ?2500/-.హోమ సంకల్పము ? ?116/-.సంప్రదించవలసిన వారు:శ్రీ అశోక్ కుమార్ ఆచార్యులు.90325 77369ఫోన్ పే గూగుల్ పే నెంబరు.:88961 23777ఆఫీస్ ల్యాండ్‌లైన్: 08518 ? 234388.భక్తులు ఈ పవిత్ర వేదోక్త అవకాశాన్ని వినియోగించుకొనినరదృష్టి, నరబాధ, నరగోష, శని దోష ప్రభావాల నుండి విముక్తి పొందిసకల కార్యాలలో స్థిరమైన విజయాన్ని పొందగలరని ప్రార్థన..







# సంపాదకీయం

గురువారం 25-12-2025


## జెన్ జెడ్ చుట్టూ ప్రపంచం

జన్ జడ్.. ఇటీవల ఈ పదం ఎక్కువగా వినిపిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా జెన్ జెడ్ యువత రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తోంది. బంగ్లాదేశ్, నేపాల్‌ల్లో ప్రభుత్వ మార్పుల్లో వీరి ప్రభావం కనిపించింది. ఇదే నేపథ్యంలో జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జెన్ జెడ్‌పై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. మార్చి 14న జరిగే జనసేన ఆవిర్భావ దినోత్సవాన్ని జెన్ జెడ్ థీమ్‌తో నిర్వహించనున్నారు. యువతను ఆకర్షించి పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యం. ఉద్యోగాలు, పారదర్శకత కోరే జెన్ జెడ్ ప్రజాస్వామ్యంలో మార్పులు తీసుకురాగలదా చూడాలి.ప్రపంచవ్యాప్తంగా జెన్ జెడ్ యూత్ ప్రభావం ఎక్కువగా ఉన్నట్లు కొన్ని వార్తా సంస్థలు తెలుపుతున్నాయి. ముఖ్యంగా ఆర్థిక, రాజకీయ అంశాల్లో ఈ యువత తమ ప్రభావంతో స్థితిగతులను మార్చి వేస్తున్నట్లు కొందరు మేధావులు అభిప్రాయపడుతున్నారు. దీంతో ప్రపంచం మొత్తం ఈ జెన్ జెడ్ యూత్ పై ఎక్కువగా ఫోకస్ చేస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో నేపాల్ రాజకీయాల్లో, బంగ్లాదేశ్ ప్రభుత్వం కూల్చడంలో ఉవని జి యూత్ ఎక్కువగా ప్రభావం చూపిందని తెలుస్తోంది. అయితే తాజాగా ఆంధ్రప్రదేశ్ లో జరిగిన జనసేన సమావేశంలో కూడా ఆ పార్టీ అధినేత మాట్లాడుతూ జెన్ జెడ్ యూత్ పై ఎక్కువగా ఫోకస్ చేయాలని అన్నారు. దీంతో జెన్ జెడ్ ప్రభావం రాజకీయ రంగంలో ఎంత ఉందో అర్థమవుతుంది. అసలు ఈ జెన్ జెడ్ యూత్ అంటే ఎవరు?1997 నుంచి 2012 వరకు జన్మించిన వారు ఇప్పుడు యవ్వనంలోకి వచ్చారు. వీరిని జెన్ జెడ్ యూత్ అని అంటారు. ఈ యువత ఎక్కువగా సోషల్ మీడియాను ఉపయోగిస్తూ ఉంటుంది. సోషల్ మీడియాను ఉపయోగించడం మాత్రమే కాకుండా తమ అభిప్రాయాలను వెంటనే వ్యక్తం చేయడం.. సామాజిక పరిస్థితులపై విశ్లేషణ చేయడం.. తప్పు, ఒప్పు ల గురించి చర్చించడం తీవ్రమైంది. ఎక్కువగా సామాజిక మాధ్యమాల్లో సమాజంలో జరిగే పరిస్థితులపై వీరు వెంటనే తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తారు. అంతేకాకుండా ఎక్కడ ఏ చిన్న విభిన్న పరిస్థితి ఏర్పడిన దానిని వీడియో తీసి సోషల్ మీడియాలో అప్లోడ్ చేస్తారు. ఇలాంటి యూత్ వల్ల ప్రస్తుత ప్రపంచ పరిస్థితులపై ఎక్కువగా ప్రభావం పడుతుందని అంటున్నారు.గతంలో నేపాల్ లో యూట్యూబ్ కంటెంట్ పై పరిమితులు విధించడంపై యువత పెద్ద ఎత్తున ఆందోళన చేసిన విషయం తెలిసిందే. వీరి ఆందోళనతోనే అక్కడి ప్రధాని దేశం విడిచి వెళ్లిపోయిన పరిస్థితి ఏర్పడింది. అంటే సాధారణ ఉద్యమాలకు భిన్నంగా వీరి ఆందోళన తీవ్రతరంగా ఉంటుంది. ర్యాలీలు, సమావేశాల ద్వారా మాత్రమే కాకుండా సోషల్ మీడియా ద్వారా వీరి ఉద్యమాన్ని ఉధృతం చేస్తారు. ఒక సమాచారాన్ని చాలామందికి చేరవేయడంలో వీరి పాత్ర ఎక్కువగా ఉంటుంది. ఆ తర్వాత బంగ్లాదేశ్ లోను అలజడి రేపిన యువత జెన్ జెడ్ యువతదే ఎక్కువ అని అంటున్నారు.తాజాగా పవన్ కళ్యాణ్ నిర్వహించిన జనసేన సమావేశంలోనూ జెన్ జెడ్ యూత్ పై ఎక్కువగా ఫోకస్ చేయాలని అభిప్రాయపడ్డాడు. వచ్చే ఆవిర్భావ సభలో జెన్ జెడ్ థీమ్ తో నిర్వహించాలని అన్నారు. వీరిని ఉపయోగించుకోవడం ద్వారా పార్టీని మరింత బలోపేతం చేసుకోవచ్చని అన్నారు. ఇప్పటికే జనసేన పార్టీకి సోషల్ మీడియాలో అత్యధిక ఫాలోవర్స్ ఉన్నారు. వీరికి ఎక్కువగా ప్రాధాన్యతమిస్తే పార్టీ మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నట్లు చెప్పారు. అయితే వచ్చే రోజుల్లో కూడా వీరి ప్రభావం మరింతగా ఉండే అవకాశం ఉందని అంటున్నారు. మరో వైపు వత ఆకాంక్షలను ప్రభుత్వాలు విస్మరిస్తే, ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ఉద్యమాలు వచ్చే ప్రమాదం ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించారు. దేశ యువత ఆకాంక్షలు ఆకాశాన్ని తాకుతుంటే, పాలకుల ఆలోచనలు మాత్రం పాకిస్థాన్, బంగ్లాదేశ్‌ల చుట్టూనే తిరుగుతున్నాయని విమర్శించారు. జెన్–జీ ఆలోచనలు, దేశ యువత ఆకాంక్షలు, ప్రభుత్వాల పాత్ర వంటి అంశాలపై తనదైన శైలిలో అద్భుతంగా ప్రసంగించి సభికులను ఆకట్టుకున్నారు. ప్రస్తుత తరం యువత (జెన్–జీ) కేవలం డిజిటల్ మీడియాకే పరిమితం కావద్దని కేటీఆర్ సూచించారు. సమాజం పట్ల అపారమైన బాధ్యతతో పనిచేయాలన్నారు. జెన్–జీ శక్తిని తక్కువ అంచనా వేయద్దని పాలకులను హెచ్చరించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం 400 ఎకరాల అటవీ భూమిని అమ్మాలని ప్రయత్నిస్తే, సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు అద్భుతంగా పోరాడి ప్రభుత్వ మెడలు వంచిన విషయాన్ని గుర్తుచేశారు. చివరికి సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని ఆ భూముల విక్రయాన్ని నిలిపివేసిందన్నారు. ఇదే జెన్–జీ పవర్ అన్నారు.సోషల్ మీడియాలో చురుగ్గా ఉండే యువత, రాజకీయాల్లోకి కూడా రావాలని కేటీఆర్ సూచించారు. "రాజకీయాలు మీ భవిష్యత్తును నిర్ణయిస్తున్నప్పుడు, మీరే ఎందుకు రాజకీయాలను నిర్ణయించలేరు?" అని కేటీఆర్ యువతకు పిలుపునిచ్చారు. ప్రపంచం అంతా ముసలితనంలో ఉంటే భారతదేశం మాత్రం యవరక్తంతో ఉరకలెత్తుతోందన్నారు కేటీఆర్. ఈ యువశక్తిని దేశ నిర్మాణానికి వాడుకోవడంలో పాలకులు విఫలమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 1985లో చైనా, భారత ఆర్థిక వ్యవస్థలు దాదాపు సమానంగా ఉండేవన్నారు. అప్పుడు చైనా తలసరి ఆదాయం 300 డాలర్లు అయితే మనది 500 డాలర్లు. కానీ 40 ఏళ్ల తర్వాత చూస్తే, ఇండియా ఆర్థిక వ్యవస్థ 4 ట్రిలియన్ డాలర్లకే పరిమితం అయితే, చైనా 20 ట్రిలియన్ డాలర్లకు ఎదిగింది. ఇవాళ చైనా తలసరి ఆదాయం 13,000 డాలర్లు అయితే మనది కేవలం 2,700 డాలర్లే అన్నారు. చైనా మనల్ని ఎలా దాటిపోయిందో ప్రతి ఒక్కరూ ఆలోచించాలన్నారు. అమెరికా, యూరప్‌లతో చైనా పోటీపడితే, మనం మాత్రం పాకిస్థాన్, బంగ్లాదేశ్‌లతో పోల్చుకుని మురిసిపోతున్నాం" అన్నారు.

## ఢిల్లీలో మూడు రోజులు ఉంటే.. అలర్జీలు వచ్చాయి

### ఢిల్లీలో నేను ఉండలేను..నితిన్ గడ్కరీ

మెవ్ డిల్లీ డిసెంబర్ 24 దేశంలో అత్యంత కాలుష్య నగరాల్లో దేశరాజధాని ఢిల్లీ మొదటి స్థానంలో ఉంటుంది. అక్కడ ఏటా శీతాకాలం సమయంలో కాలుష్య స్థాయిలు ప్రమాదకరస్థాయిలో ఉంటాయి. ఈ నేపథ్యంలో ఢిల్లీలో వాయు కాలుష్యంపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తాజాగా కీలక వ్యాఖ్యలు చేశారు. తాను మూడు రోజులు



ఢిల్లీలో ఉంటే.. కాలుష్యం కారణంగా అలర్జీలు వచ్చాయని తెలిపారు. ఢిల్లీలో జరిగిన ఓ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో గడ్కరీ పాల్గొని మాట్లాడారు. ఢిల్లీలో తీవ్ర కాలుష్యానికి 40 శాతం రవాణా రంగమే కారణమని అంగీకరించారు. 'నేను రవాణా శాఖ మంత్రిని. 40 శాతం కాలుష్యానికి రవాణా రంగమే కారణం' అని తెలిపారు.'ఇది ఎలాంటి జాతీయవాదం..? శిలాజ ఇంధనాలు పరిమితంగా ఉన్నాయి. కాలుష్యం పెరుగుతోంది. శిలాజ ఇంధన వినియోగాన్ని మనం తగ్గించలేమా..? సున్నా కాలుష్యానికి దారితీసే ఎలక్ట్రిక్ వాహనాలు, హైడ్రోజన్ శక్తితో నడిచే వాహనాలను మనం ఎందుకు ప్రోత్సహించలేము..?' అని నితిన్ గడ్కరీ ప్రశ్నించారు. శిలాజ ఇంధనాల్ని దిగుమతి చేసుకోవడానికి ఏటా రూ.22 లక్షల కోట్ల ఖర్చు అవుతోందని.. ఇది ఆర్థిక భారమని చెప్పారు. దీనికి ప్రత్యామ్నాయంగా ఎలక్ట్రిక్, హైడ్రోజన్ వాహనాల వైపు మళ్లాలని సూచించారు.కాగా, ఢిల్లీ కాలుష్యంపై గడ్కరీ గతంలోనూ ఇలాంటి వ్యాఖ్యలే చేసిన విషయం తెలిసిందే. తాను రాజధాని నగరంలో రెండు లేదా మూడు రోజులకంటే ఎక్కువ ఉండలేనని అన్నారు. ఢిల్లీకి వస్తే.. ఎప్పుడెప్పుడు వెళ్లిపోదామా అనే ఉంటుందని వ్యాఖ్యానించారు. 'నేను ఢిల్లీలో రెండు లేదా మూడు రోజులు మాత్రమే ఉండగలను. అంతకుమించి ఉండటం నావల్ల కాదు. ఢిల్లీలో అడుగుపెట్టగానే ఎప్పుడు వెళ్లిపోదామా అనే ఉంటుంది. అందుకే నేను వచ్చేటప్పుడే రిటర్న్ టికెట్స్ కూడా బుక్ చేసుకుంటాను. ప్రజలు ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించాలి. ఢిల్లీలో కాలుష్యం కారణంగా సాధారణ ప్రజల ఆయుర్దాయం తగ్గింది. వాహనాలకు వినియోగించే శిలాజ ఇంధనాల వల్ల కలిగే కాలుష్యాన్ని తగ్గించడం ప్రజలందరి ప్రధాన బాధ్యత' అని అన్నారు.

## రెడ్డిపల్లి సబ్ స్టేషన్ ను అకస్మాత్తుగా తనిఖీ చేసిన మాజీ మంత్రి హరీష్ రావు, ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి.

హైదరాబాద్ ,రెడ్డిపల్లి సబ్ స్టేషన్ ను మాజీ మంత్రి హరీష్ రావు, ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి అకస్మాత్తుగా తనిఖీ చేసారు.. హరీష్ రావు మాట్లాడుతూరేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతులకు కేవలం 12 గంటల కరెంటు మాత్రమే సరఫరా చేస్తున్నట్టుగా ఉంది నర్సాపూర్ సబ్ స్టేషన్ లో,సునీత లక్ష్మారెడ్డి నేను కలిసి సబ్ స్టేషన్ ను విజిట్ చేయడం జరిగింది. పార్టీ సమావేశానికి వెళ్తుండగా రైతులు కరెంట్ రావడంలేదని ఫోన్ చేస్తే సడన్గా ఆగడం జరిగింది. రెండు గ్రామాల రైతులు రెడ్డిపల్లి, మద్దూరు గ్రామ రైతులు ఫోన్ చేసి మాకు కరెంటు సరిగ్గా రావడంలేదని ఫోన్ చేస్తే మేము ఇక్కడికి సబ్ స్టేషన్ దగ్గర ఆగడం జరిగింది.రేవంత్ రెడ్డి 24 గంటలు కరెంటు ఇస్తమంటున్నాడురెడ్డిపల్లి మద్దూరు గ్రామాల ప్రజలు 12–13 గంటలకు కరెంటు మాత్రమే వస్తుంది. మాకు ఇబ్బంది అవుతుంది నారుబోసే సమయము పొలానికి నారేసే టైం ఇబ్బంది అవుతుందని.. ఫోన్ చేస్తే ఇది నిజమా కాదా అని సమస్య ఏంది అని తెలుసుకుందామని నర్సాపూర్ సబ్ స్టేషన్ కు రావడం జరిగింది. ఇక్కడ లాక్ బుక్ చూస్తే కేవలం 12 గంటల కరెంటు మాత్రమే వచ్చింది.ఇంకొక రోజు చూస్తే సాయంత్రం ఐదు గంటలకు పోయి ఉదయం 3:00 వచ్చింది. అంటే 14 గంటలు మాత్రమే వచ్చింది ఇంకొక రోజు చూస్తే 13 గంటల కరెంట్ వచ్చింది అంటే ఈ విధంగా 12,13 గంటల కరెంటు మాత్రమే వస్తుంది.రేవంత్ రెడ్డి ఎన్నికల ముందు కరెంటుకు మేమే చాంపియన్, 24 గంటల కరెంటుకు మేమే బ్రాండ్ అంబాసిడర్ అని చెప్పిండు.మరి 12 గంటల కరెంట్ ఎందుకు వస్తుంది నాయనా రేవంత్ రెడ్డి.ఆనాటి కాంగ్రెస్ పాలనలో కరెంటుతో రైతులు ఇబ్బందులు పడ్డారు నేడు కాంగ్రెస్ పాలనలో రైతులు కరెంటుతో ఇబ్బందులు పడుతున్నారు.నాడు ఎరువులకు ఇబ్బందులు పడ్డారు నేటి కాంగ్రెస్ పాలనలో ఎరువులకు ఇబ్బందులు పడుతున్నారు.మేం ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తా ఉన్నాం రైతులకు 24 గంటల కరెంటు ఇవ్వాలి.భట్టి విక్రమార్క మీరు పెద్దపెద్ద మాటలు మాట్లాడడం కాదు,కెసిఆర్ అంటేనే 24 గంటల కరెంటు కు బ్రాండ్ అంబాసిడర్:ఎన్నికల్లో హామీ ఇవ్వకపోయినా రైతుల కోసం 24 గంటలు నాణ్యమైన కరెంటు ఇచ్చింది కేసీఆర్ ప్రభుత్వం. కానీ మీరు వచ్చిన తర్వాత 12 13 గంటల కరెంటు కూడా రైతులకు రావడం లేదు,ఏది చూసినా సగం సగమే ఉంది రేవంత్ ప్రభుత్వంలో24 గంటల కరెంటు రైతు బంధు, రుణమాఫీ బోనస్ అన్నిట్లో సగం సగం,దమ్ముంటే అసెంబ్లీలో విద్యుత్ సరఫరా మీద చర్చ పెట్టండిప్రతిపక్షాల మీద బురద జల్లడం కాదు, రైతు సమస్యల మీద ప్రజల సమస్యల మీద చర్చ పెట్టండిరైతులకు ఇచ్చిన హామీలు ఎగ్గొటినందుకు భయపడి కారు గుర్తు కనపడే ఎన్నికలు పెడుతలేడు.రేవంత్ రెడ్డి నీకు దమ్ముంటే కో ఆపరేటివ్ ఎన్నికలు పెట్టుఈ ప్రభుత్వమే రైతు వ్యతిరేక ప్రభుత్వం. మేం ఒచ్చి చూసినం అని ఈ అధికారుల మీద చర్యలు తీసుకోకూ రేవంత్ రెడ్డి.నీకు నిజాయితీ ఉంటే రైతులకు 24 గంటల కరెంటు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాం.

## రేవంత్‌రెడ్డితోని ఫుట్‌బాల్ ఆడుకునే రోజులు దగ్గర్లనే ఉన్నయ్ : హరీశ్‌రావు

సిద్దిపేట : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి హరీశ్‌రావు మరోసారి తీవ్ర విమర్శలు గుప్పించారు. పంచాయతీ ఎన్నికల్లో గెలిచిన బీఆర్ఎస్ సర్పంచులు, వార్డు మెంబర్ల సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. వారికి శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు. అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపైన, సీఎం రేవంత్‌రెడ్డి తీరుపైన నిప్పులు చెరిగారు.హరీశ్‌రావు ఇంకా ఏమన్నారంటే.. 'కాంగ్రెసోళ్లు ఒక్కటన్న మంచి పని చేసిండ్రా. కానీ వందల కోట్లు ఖర్చుపెట్టి అందాల పోటీలు పెట్టిండు రేవంత్‌రెడ్డి. ఎవరికి పనికొస్తయ్ ఆ అందాల పోటీలు. వందల కోట్లు ఖర్చు పెట్టి ఫుట్‌బాల్ ఆడుతడు రేవంత్ రెడ్డి. నువ్వు ఫుట్‌బాల్ ఆడితే మాకేం వస్తది. నిన్ను ఫుట్ బాల్ ఆడే రోజులు దగ్గర్లనే ఉన్నయ్ రేవంత్‌రెడ్డీ. నువ్వు ఫుట్‌బాల్ ఆడుడు కాదు, నిన్ను ఫుట్‌బాల్ ఆడుతరు తెలంగాణ ప్రజలు. సింగరేణి పైసలు రూ.10 కోట్లు, సీఎస్ఆర్ పైసలు రూ.100 కోట్లు, గవర్నమెంట్ పైసలు రూ.5 కోట్లతోని స్టేడియంగట్టి ఈయన ఫుట్‌బాల్ ఆడుతడు. ఎవనిగ్గావలె ఈయన ఆట' అని మండిపడ్డారు.'బీఆర్ఎస్ హయాంలో సింగరేణి పైసలతోని స్కూళ్లు కట్టినం. కాలేజీలు గట్టినం. పిల్లల చదువుల కోసం ఆలోచన చేసినం. ఇయ్యాల రేవంత్‌రెడ్డి ఖర్చుచేసిన ఆ డబ్బులుంటే కోటి రూపాయలకొక స్కూల్ కట్టొచ్చు. రోడ్లు వేయించొచ్చు. నువ్వు ఫుట్‌బాల్ కోసం ఖర్చు పెట్టుడు ఏంది..? నువ్వు ఫుట్ బాల్ ఆడుతందుకు వందల కోట్లు ఖర్చు పెడితే మా పిల్లలకు ఏమొస్తది..? మా ప్రజలకు ఏమొస్తది..? నీకు అందాల పోటీల మీదున్న ప్రేమ, ఫుట్‌బాల్ మీదున్న ప్రేమ మా రైతులకు ఎరువులు సరఫరా చేయడంపైన లేకపాయే' అని విమర్శించారు.'మొన్నటిదాకా రైతులు వానల తడుసుకుంట యూరియా కోసం లైన్‌ల నిబడ్డరు. ఇప్పుడేమో యాప్‌లు, మ్యాప్‌లు అంటున్నరు. ఎవనికి గావాలె ఆ యాప్‌లు, మ్యాప్‌లు. కేసీఆర్ హయాంలో ఆటో డ్రైవర్‌కు ఫోన్ చేసి నాలుగు బస్తాల యూరియా తెమ్మంటే తెచ్చి ఇంటిదగ్గర ఏసెటోళ్లు. ఇప్పుడు పొద్దుగాల్నే లేసి సద్దిగట్టుకుని వచ్చి లైన్‌ల నిలబడే గోస ఏంది..? పంట పండిస్తందుకు నీళ్లు, కరెంటు, ఎరువులు గావాలె. కానీ రేవంత్‌రెడ్డి యాప్‌లు, మ్యాప్‌లు అంటున్నడు. బీఆర్ఎస్ టైమ్‌ల చార్జీలు లేకుండా ఊళ్లల్లకే తెచ్చి ఎరువులు ఇచ్చినం. ఇప్పుడెందుకు అయితలేదు' అని ప్రశ్నించారు.



## ప్రేమ,శాంతి,దయ, కరుణలను పంచుకోవడమే క్రిస్మస్ సందేశం

-మంథని డివిజన్ లో నేటి క్రిస్మస్ వేడుకలకు ముస్తాబైన పలు చర్చీలు

-నేడు కరుణామయుడు యేసుక్రీస్తు జన్మించినదినం

మంథని ,డిసెంబర్ 24, (న్యూస్ పల్స్) ప్రేమ,శాంతి,దయ, కరుణలను పంచుకోవడమే క్రిస్మస్ సందేశం కాగా,సకల జనులూ సంయమనంతో కలిసిమెలిసి ఉండాలన్న క్రీస్తు బోధనలు మానవాళికి ఆచరణీయం అయ్యాయి. యేసుక్రీస్తు జన్మదినం సందర్భంగా క్రైస్తవులు జరుపుకునే అతిపెద్ద పండుగ క్రిస్మస్ ప్రపంచ వ్యాప్తంగా జరుపుకునే ఈ పండుగను అంగరంగ వైభవంగా క్రైస్తవ సోదరులు జరుపుకుంటారు. క్రైస్తవులు దీన్ని ఎంతో పవిత్రంగా భావిస్తారు. యేసుక్రీస్తు జన్మించి దాదాపు రెండువేల ఇరవై ఐదు సంవత్సరాలు దాటిన ఆయన కరుణామయునిగా, దయామయునిగా ఆయన క్రైస్తవుల ఆరాదనలు అందుకుంటున్నారు. డిసెంబర్ మొదటివారం నుంచి క్రైస్తవుల గృహాలలో, చర్చిలలో క్రిస్మస్ సందడి నెలకొంటుంది. ప్రపంచ వ్యాప్తంగా డిసెంబర్ 25న క్రైస్తవులు ఘనంగా నిర్వహించుకునే యేసుక్రీస్తు పుట్టిన రోజు పండుగ క్రిస్మస్ వేడుకలను జరుపుకునేందుకు మంథని డివిజన్ పరిధిలోని క్రైస్తవులు సిద్ధమయ్యారు. డివిజన్ కేంద్రంలోని సీయోను చర్చి, ఆర్.సీ.ఎం, బేతేలు ప్రార్థన మందిరం, గ్లోరియస్ ప్రార్థన మందిరం చర్చిలతో పాటు ఆయా గ్రామల్లోని చర్చిలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. క్రైస్తవుల ఇళ్లపై, చర్చిలపై క్రిస్మస్ ట్రీలు, నక్షత్రాలు ఏర్పాటు చేయడంతో చూపరులను ఆకట్టు కుంటున్నాయి. క్రైస్తవుల్లో ప్రతి ఇంటి పైన నక్షత్రం గుర్తును పోలిన స్టార్లను క్రిస్మస్ ట్రీలను ఏర్పాటు చేసుకున్నారు. డివిజన్ పరిధిలోని పలు చర్చిలలో 24న అర్ధరాత్రి నుంచే ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహిస్తారు. డిసెంబర్ 25న చర్చిలలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేసి పండుగను సంబరంగా జరుపుకుంటారు. ఈ వేడుకలు 25 క్రిస్మస్ పండుగతో ప్రారంభమై 30, 31న ఉపవాస కూడికలు నిర్వహించి జనవరి 1న నూతన సంవత్సర వేడుకలతో ముగుస్తాయి.

## 20 ఏళ్ల తర్వాత కలిసిన థాక్రే సోదరులు.. ముంబై స్థానిక ఎన్నికల్లో కలిసి పోటీ



మహారాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామం చోటు చేసుకుంది. విభేదాలతో విడిపోయిన థాక్రే సోదరులు ఉద్ధవ్ థాక్రే రాజ్ థాక్రే మళ్లీ కలిశారు.ముంబై స్థానిక ఎన్నికల్లో కూటమిగా ఏర్పడి పోటీ చేస్తామని ప్రకటించారు. బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో అన్నదమ్ములిద్దరూ కీలక ప్రకటన చేశారు. జనవరి 15న జరగబోయే మున్సిపల్ ఎన్నికల్లో శివసేన (ఠాక్రే వర్గం), మహారాష్ట్ర నవనిర్మాణ సేన (ఎంఎన్ఎస్) కలిసి పోటీ చేస్తాయని ప్రకటించారు. ముంబైకి మరాఠీ మేయర్ రానున్నారని వెల్లడించారుకాగా, 2005లో విడిపోయిన వీరు దాదాపు 20 ఏళ్ల తర్వాత తిరిగి కలుసుకున్నారు. ఈ ఏడాది జులైలో ముంబైలో నిర్వహించిన 'వాయిస్ ఆఫ్ మరాఠీ' కార్యక్రమంలో తొలిసారి ఒకే వేదికపై కనిపించారు. ఈ సందర్భంగా ఇద్దరూ ఆప్యాయంగా మాట్లాడుకున్నారు. ఇకపై ఇద్దరం కలిసే ఉంటామని సోదరులు అప్పుడు స్పష్టం చేశారు. ఇక అన్నదమ్ముల కలయికపై ఇరు పార్టీల కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు

## ఎమ్మెల్యే కడియం శ్రీహరి సభలో ప్రొటోకాల్ లొల్లి.. ఆందోళన చేపట్టిన సర్పంచ్‌లు

లింగాల గణపురం : జనగామ జిల్లా లింగాల గణపురంలో సర్పంచులు ప్రొటోకాల్ లొల్లికి దిగారు. కల్యాణలక్ష్మి, షాది ముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీకి ఎమ్మెల్యే కడియం శ్రీహరి హాజరయ్యారు. కాగా, అధికారిక కార్యక్రమాలలో స్థానిక సర్పంచ్‌ను వేదికపైకి ఆహ్వానించాలని ప్రొటోకాల్ నిబంధన ఉంది. దానికి విరుద్ధంగా లింగాల గణపురం బీఆర్ఎస్ సర్పంచ్ ఎడ్ల లావణ్యను పిలవాల్సి ఉండగా..ఆమెపై కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థిగా ఓడిన శ్రీలత రెడ్డిని, లింగాల గణపురానికి చెందిన నీలం మోహన్‌ను మార్కెట్ డైరెక్టర్ హోదాలో వేదికపైకి ఆహ్వానించారు.సభ జరిగేంతవరకు టెంట్ కింద ప్రత్యేకంగా సర్పంచుల కోసం వేసిన కుర్చీలలోనే ఎడ్ల లావణ్య ఉండిపోయింది. లబ్ధిదారులకు చెక్కులను ఇచ్చే సమయంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు ఎమ్మెల్యే చేతుల మీదుగా అందించాల్సి ఉండగా..కొన్ని గ్రామాల్లో ఓడిపోయిన కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థులను వేదికపైకి పిలిచి వారిచే మా సర్పంచ్ అంటూ చెక్కులను ఇప్పించడం వివాదానికి దారి తీసింది. ఎమ్మెల్యే వెళ్లిపోగానే తహసీల్దార్ రవీందర్, ఎంపీడీవో శివ శంకర్ రెడ్డితో పంచాయతీ కార్యదర్శులు, బీఆర్ఎస్ సర్పంచులు గొడవకు దిగారు. కార్యక్రమానికి మమ్ములను ఆహ్వానించి పరువు ఎందుకు తీశారని విరుచుకుపడ్డారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం ఎదుట బీఆర్ఎస్ సర్పంచులు ధర్నాకు దిగి.. కడియంకు మండల అధికారులు తొత్తులుగా మారారని ఆరోపించారు.



## సోషల్ మీడియా వారియర్స్ ఆర్తనాదాలు

విశాఖపట్టణం డిసెంబర్ 24, వైసీపీ కార్యకర్తలు సాయం కోసం అల్లాడిపోతున్నారు. వైసీపీ కోసం విదేశాల్లోఉన్నా కెరీర్ ను నిర్లక్ష్యం చేసి మరీ పార్టీ కోసం పని చేస్తూ బ్రెయిన్ స్ట్రోక్ కు గురైతే కనీసం పార్టీ నుంచి పట్టించుకునేవారు లేకపోవడం వారిని ఆందోళనకు గురి చేస్తోంది. ఇటీవలి కాలంలో ఇలాంటి వారు పెరిగిపోతున్నారు. కానీ పార్టీ నుంచి మాత్రం సాయం అందకపోవడంతో వారిని ఆందోళనకు గురి చేస్తోంది.చదువు కోసమో.. ఉద్యోగం కోసమో అమెరికాకు వెళ్లిన కృష్ణారెడ్డి అనే వైసీపీ కార్యకర్త.. అక్కడి నుంచి సోషల్ మీడియా వారియర్ గా పని చేస్తూంటారు. కూటమి నేతలను ట్రోల్ చేయడం, అసభ్యంగా పోస్టులుపెట్టడం వంటివి వైసీపీ సోషల్ మీడియా కార్యకర్తలకు కామన్ కాబట్టి విదేశాల్లో ఉన్నా అవన్నీ చేస్తూంటాడు. అయితే హఠాత్తుగా అతను బ్రెయిన్ స్ట్రోక్‌కు గురయ్యాడు. ఆయన ఆరోగ్యం ప్రస్తుతం విషమంగా ఉండటంతో ఆసుపత్రిలో అత్యవసర చికిత్స అందిస్తున్నారు.డల్లాస్‌లో జరిగిన వైఎస్ జగన్ జన్మదిన వేడుకల సందర్భంగా వైసీపీ ఎమ్మెల్సీ పీవీవీ సూర్యనారాయణ రాజు కృష్ణారెడ్డికి వైద్య సాయం కోసం వెయ్యి డాలర్లు ఇచ్చారు. ఆయన వ్యక్తిగతంగా సాయం చేశారు. కృష్ణారెడ్డి వైద్య ఖర్చుల భారం భారీగా ఉండటంతో, ఆయన కుటుంబానికి అండగా నిలిచేందుకు స్నేహితులు మరియు శ్రేయోభిలాషులు 'ఉ నీఈబీనిటఓవ' ద్వారా విరాళాలు సేకరిస్తున్నారు. రెండున్నర లక్షల డాలర్లు సాయంకావాలని కోరుతున్నారు. కొంత మంది స్పందిస్తున్నారు. కానీ పార్టీ పరమైన సాయం ఇంకా ప్రకటన రాలేదు. సోషల్ మీడియాలో చురుగ్గా ఉ ంటూ పార్టీ కోసం పనిచేసిన కృష్ణారెడ్డికి సహాయం చేయాలని ఆయన కుటుంబసభ్యులు ఎన్ఆర్ఐ వైసీపీ శ్రేణులు, అభిమానులను కోరుతున్నారు. అమెరికాలోనే కాదు.. ఏపీలోనూ వైసీపీ కార్యకర్తలు ఇలాంటి కష్టాల్లో పడితే పట్టించుకునేవారు లేకుండా పోయింది. గతంలో అధికారంలో ఉన్నప్పుడు శ్యామ్ కలకడ అనే సోషల్ మీడియా వారియర్ ను అలాగే వదిలేయడంతో ఆయన చనిపోయారు. ఇప్పుడు విపక్షంలో ఉన్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదు. చివరికి ఎవరికి వారు లోకేష్ సాయం కోరుతూ ట్వీట్లు పెట్టి కొంత మంది సాయం పొంది ప్రాణాలు కాపాడుకున్నారు. కానీ వైసీపీ నుంచి మాత్రం ఎలాంటి మద్దతూ లభించడం లేదు. ఇది వారి క్యాడర్ ను బాధిస్తోంది.

## పవన్ జాతీయ స్థాయిలో ముద్ర...

కాకినాడ డిసెంబర్ 24, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జాతీయస్థాయిలో సైతం తన ముద్రను చాటుకుంటున్నారు. జాతీయస్థాయి రాజకీయాలను శాసిస్తున్న ఆయన ఇప్పుడు ఏపీలో నిర్వర్తిస్తున్న శాఖలను సైతం ముందంజలో తీసుకెళ్తున్నారు. ఏపీలో ఆయన నిర్వహిస్తున్న పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ జాతీయస్థాయిలో నంబర్ వన్ గా నిలిచింది. గతంలో జాతీయస్థాయిలో 23వ స్థానంలో ఉన్న ఏపీ 22 స్థానాలను మెరుగుపరుచుకొని ఒకటో స్థానంలో నిలవడం ప్రాధాన్యత సంతరించుకుంది. నేషనల్ మీడియా లో సైతం ఇప్పుడు పవన్ కళ్యాణ్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నారు.



రాజకీయంగాను తనదైన మార్క్ చూపిస్తున్నారు పవన్ కళ్యాణ్. ఏపీలో కూటమి కట్టడంలో ఆయనదే కీలక పాత్ర. అప్పటివరకు బిజెపితో పాటు టిడిపి మధ్య గ్యాప్ ఉ ండేది. అయితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని అధికారం నుంచి దూరం చేయాలంటే మూడు పార్టీల కలయికను ముందే గుర్తు చేశారు పవన్ కళ్యాణ్. వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం చంద్రబాబును అక్రమం గా అరెస్టు చేస్తే సంఘీభావం తెలిపి నేరుగా టిడిపితో పొత్తు ఉంటుందని సంచలన ప్రకటన చేశారు. బిజెపిని కూటమిలోకి తేవడంలోనూ.. తెలుగు దేశం పార్టీని ఎన్డీఏలో చేర్చడంలోనూ చురుకైన పాత్ర పోషించారు. ఏపీలో మూడు పార్టీల కలయిక సూపర్ హిట్ గా నిలవగా.. జాతీయస్థాయిలో నరేంద్ర మోడీ మూడోసారి అధికారంలోకి రావడానికి కూడా ఒక విధంగా ఏపీ కారణం. ఇదంతా పవన్ కళ్యాణ్ కృషి ఫలితం.ఏపీలో టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత పవన్ కళ్యాణ్ కు డిప్యూటీ సీఎం హోదా దక్కింది. అటు పవన్ కళ్యాణ్ సైతం తనకు గ్రామీణ నేపథ్యం ఉన్న శాఖలు కావాలని కోరారు. అందుకే పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి తో పాటు అటవీ శాఖను ఇచ్చారు చంద్రబాబు. దాదాపు 5 శాఖలు పవన్ కళ్యాణ్ వద్ద ఉన్నాయి. ఆ శాఖల విషయంలో పవన్ కళ్యాణ్ కు పూర్తి స్వేచ్ఛ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో పాటు రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన నిధులు గ్రామీణ శాఖలకు కేటాయిస్తూ.. అభివృద్ధికి బాటలు వేశారు పవన్ కళ్యాణ్. పల్లె పండుగ పేరుతో రికార్డు స్థాయిలో గత రెండేళ్లుగా అభివృద్ధి పనులు చేశారు. దీంతో గ్రామాల్లో మౌలిక వసతులు సమకూరాయి. అందుకే జాతీయస్థాయిలో గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ నెంబర్ వన్ గా నిలిచింది. ఈ క్రెడిట్ మాత్రం వన్ అండ్ ఓన్లీ పవన్ కళ్యాణ్.

## వాజ్ పేయి విగ్రహంతో మొదలు

విజయవాడ, డిసెంబర్ 24, ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి విగ్రహాల రాజధానిగా రూపుదిద్దుకుంటోంది. అధికార కూటమిలోని పార్టీలు తమ నాయకులను గౌరవించుకుంటూ భారీ విగ్రహాలను ప్రతిష్ఠించేందుకు సన్నాహాలు చేస్తున్నాయి. బీజేపీ ఇప్పటికే అటల్, మోదీ సుపరిపాలన యాత్రలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా వాజ్‌పేయీ విగ్రహాలను ఏర్పాటు చేస్తుండగా, అమరావతిలోని వెంకటపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు సమీపంలో ఒక భారీ కాంస్య విగ్రహాన్ని నెలకొల్పనుంది. ఈ విగ్రహ ఆవిష్కరణ ఈ నెల 25న జరగనుందని, కేంద్ర మంత్రి అమిత్ షా హాజరయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది.ఔఆంలో కీలక భాగస్వామిగా ఉన్న టీడీపీ ఆధ్వర్యంలోని ఏపీ ప్రభుత్వం.. రాష్ట్ర నూతన రాజధానిలో బీజేపీ దిగ్గజ దివంగత నేత అటల్ బిహారీ వాజ్ పేయీ విగ్రహం ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ నిర్ణయం ద్వారా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య మరింత సమన్వయం పెరుగుతుందని టీడీపీ భావిస్తోంది. అభివృద్ధి, సమన్వయం, ప్రజాస్వామ్య విలువలతో కూడిన పాలనకు ప్రతిరూపంగా వాజ్‌పేయిని భావిస్తూ.. అదే దిశలో అమరావతిని ముందుకు నడిపించాలన్న సందేశం ఇందులో ప్రతిఫలిస్తోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.వాజ్ పేయీ శతజయంతి ఉత్సవాల సందర్భంగా వెంకటపాలెంలో ఏర్పాట్ల చేయబోయే వాజ్‌పేయి విగ్రహా ఏర్పాట్లను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీ.వీ.ఎన్. మాధవ్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాధవ్ మాట్లాడుతూ వాజ్‌పేయి శతజయంతి ఉత్సవాల నేపథ్యంలో అమరావతిలో కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అమరావతిలో ఏర్పాటు చేస్తున్న తొలి విగ్రహం వాజ్‌పేయిదే కావడం గర్వకారణమని చెప్పారు. అందరికీ స్ఫూర్తి, ప్రేరణ కలిగించేలా వాజ్‌పేయి విగ్రహం ఉండబోతుందని మాధవ్ పేర్కొన్నారు.

# గొల్లపూడిలో శాటిలైట్ రైల్వేస్టేషన్...



విజయవాడ, డిసెంబర్ 24,గొల్లపూడిలో కొత్త శాటిలైట్ రైల్వే స్టేషన్ ఏర్పాటు చేయాలని ఎంపీలు కేశినేని శివనాథ్, దగ్గుబాటి పురందేశ్వరి రైల్వేమంత్రిని కోరారు. దీనివల్ల విజయవాడ స్టేషన్‌పై భారం తగ్గుతుందని, అమరావతి కనెక్టివిటీ పెరుగుతుందని తెలిపారు. అలాగే, కొండపల్లి రైల్వే స్టేషన్ వద్ద నీటి సమస్యను పరిష్కరించి, రైళ్ల రాకపోకలకు భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రతిపాదనలపై రైల్వే మంత్రి నిర్ణయం కీలకం కానుంది.ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా శాటిలైట్ రైల్వే స్టేషన్ ప్రతిపాదన తెరపైకి వచ్చింది. గొల్లపూడి సమీపంలో శాటిలైట్ రైల్వేస్టేషన్ ఏర్పాటు చేయాలని స్థానిక ఎంపీ కేశినేని శివనాథ్, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కోరారు.. వినతిపత్రం సమర్పించారు. గొల్లపూడిలో శాటిలైట్/హాల్ట్ రైల్వేస్టేషన్ ఏర్పాటు చేస్తే విజయవాడ రైల్వేస్టేషన్ పై భారం తగ్గుతుందని ఎంపీలు వివరించారు. ఈ శాటిలైట్ స్టేషన్ ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. ప్రస్తుతం బల్బ్‌లైన్స్ చుట్టూ ఖాళీ స్థలాలున్నాయని, వాటిని రైల్వే అవసరాలకు సులభంగా సేకరించవచ్చని రైల్వేమంత్రికి వివరించారు. ఈ ప్రాంతం కొత్త రైలు, వాయుమార్గాలతో అనుసంధానం కానుందని.. అమరావతి రైల్వేలైన్ నిర్మాణం కూడా జరుగుతోందన్నారు. ఈ ప్రాంతం విజయవాడ నగరానికి అన్ని సౌకర్యాలకు సెంటర్‌గా ఉంది కాబట్టి, గొల్లపూడిలో హాల్ట్/శాటిలైట్ స్టేషన్ నిర్మించాలన్నారు.అలాగే అంతేకాదు కొండపల్లి రైల్వేస్టేషన్ దగ్గర నీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. కొండపల్లి రైల్వేస్టేషన్ నుంచి కృష్ణా మిల్క్ యూనియన్ వరకు రైల్వే ట్రాక్‌పై నీరు చేరకుండా నీటి నిర్వహణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కూడా ఎంపీలు కోరారు. ఈ రెండు సమస్యల పరిష్కారం వల్ల ప్రయాణికులకు సౌకర్యవంతంగా ఉంటుందని వారు అభిప్రాయపడ్డారు. కొండపల్లి రైల్వేస్టేషన్ నుండి విజయవాడలోని కృష్ణా మిల్క్ యూనియన్ వరకు ఉన్న రైల్వే ట్రాక్‌పై మురుగునీరు, వర్షపునీరు నిలిచిపోవడం వల్ల రైళ్ల రాకపోకలకు భద్రతాపరమైన సమస్యలు తలెత్తుతున్నాయని వారు వివరించారు.చిన్నపాటి వర్షం వచ్చినా ఇక్కడ నీరు నిలిచిపోతోందని, దీనివల్ల రైళ్ల రాకపోకలకు అంతరాయం కలుగుతోందని ఎంపీలు కేశినేని శివనాథ్, దగ్గుబాటి పురందేశ్వరి కేంద్రమంత్రికి తెలిపారు.ఈ సమస్యను పరిష్కరించడానికి, ట్రాక్ పక్కన డ్రైనేజీ కాలువలు, కల్వర్టులు నిర్మించి వర్షపునీరు సులభంగా వెళ్లిపోయేలా చూడాలని వారు కోరారు. ఇందుకోసం వెంటనే నిధులు కేటాయించి, పనులు త్వరగా పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ చర్యల వల్ల రైళ్ల రాకపోకలకు ఎలాంటి ఆటంకం కలగకుండా, ప్రయాణికుల భద్రత కూడా మెరుగుపడుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. మరి ఎంపీల ప్రతిపాదనలపై రైల్వే మంత్రి ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో చూడాలి.'కొండపల్లి రైల్వే స్టేషన్ నుంచి విజయవాడలోని కృష్ణ మిల్క్ యూనియన్ వరకు ఉన్న రైల్వే ట్రాక్ వెంట మురుగునీరు, వర్షపు నీరు నిల్వ అవుతున్న సమస్యలను కూడా కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవి గారికి వివరించాను. వర్షాకాలంలోనే కాకుండా సాధారణ వర్షపాతం సమయంలో కూడా శాస్త్రీయంగా రూపొందించిన డ్రైనేజ్ నెట్వర్క్, క్రాస్ డ్రైనేజ్ నిర్మాణాలు, కాలువలు అనుసంధానం లేకపోవడం వల్ల ట్రాక్ వెంట మురుగు నీరు నిల్వవుంటుందని తెలియజేశాను.. ఈ నీటి నిల్వల వల్ల స్థానిక నివాసితులు, పరిశ్రమలు ముఖ్యంగా కృష్ణ మిల్క్ యూనియన్ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు అని తెలిపాను. ఈ ప్రతిపాదనకు అమల్లోకి వస్తే విజయవాడ నగరంలో రైల్వే రవాణా మరింత సవ్యంగా మారడంతో పాటు, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు, రైల్వే భద్రత, పరిశ్రమలు, స్థానిక ప్రజలకు కలుగుతున్న ఇబ్బందులు గణనీయంగా తగ్గుతాయని ఆశాభావం వ్యక్తం చేశాను.. ఈ ప్రతిపాదనలపై కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ గారు సానుకూలంగా స్పందించారు' అంటూ ఎంపీ కేశినేని శివనాథ్ తెలిపారు.

## వై.ఎస్.జగన్ అక్రమాస్తుల కేసు మళ్లీ మొదటికి

విజయవాడ, డిసెంబర్ 24, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అక్రమాస్తుల కేసు దశాబ్ద కాలంగా తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లోనే కాకుండా, న్యాయ వ్యవస్థలోనూ ఒక సంచలనంగా మారింది. 2011లో ప్రారంభమైన ఈ కేసు విచారణ, అనేక మలుపులు తిరుగుతూ నేటికీ ఒక కొలిక్కి రాలేదు. తాజాగా నాంపల్లి సీబీఐ కోర్టు ప్రధాన న్యాయమూర్తి టి. రఘురాం బదిలీ అవ్వడం, ఆయన స్థానంలో కె. పట్టాభిరామారావు నియామకం జరగడంతో ఈ కేసు విచారణ మళ్లీ మొదటికి వచ్చిందనే చర్చ మొదలైంది. ఈ కేసు విచారణ నత్తనడకన సాగడానికి అనేక కారణాలున్నాయి.కేసు విచారణలో ఎదురవుతున్న అతిపెద్ద అవరోధం న్యాయమూర్తుల బదిలీలు. జగన్ అక్రమాస్తుల కేసులో వేల పేజీల డాక్యుమెంట్లు, వందలాది సాక్ష్యాలు, 11 ఛార్జ్‌షీట్లు ఉన్నాయి. ఒక న్యాయమూర్తి ఈ కేసు పూర్వాపరాలను అర్థం చేసుకుని, విచారణను ఒక దశకు తీసుకొచ్చే సమయానికి వారు బదిలీ అవుతున్నారు. కొత్తగా వచ్చే న్యాయమూర్తి మళ్లీ మొదటి నుండి కేసును అధ్యయనం చేయాల్సి రావడం వల్ల విచారణ ప్రక్రియ నిరంతరం జాప్యం అవుతోంది.సీబీఐ ఈ కేసులో దాదాపు 11 ప్రధాన ఛార్జ్‌షీట్లు దాఖలు చేసింది. ఇందులో పెట్టుబడులు, క్విడ్ ప్రో కో భూ కేటాయింపులు వంటి అనేక అంశాలు ముడిపడి ఉన్నాయి. నిందితులు తమపై ఉన్న ఆరోపణలను కొట్టివేయాలని కోరుతూ డిశ్చార్జ్ పిటిషన్లు దాఖలు చేయడం వల్ల ప్రధాన విచారణ ప్రారంభం కావడం లేదు. అంతేకాక, విచారణ జరుగుతున్న ప్రతిసారీ ఏదో ఒక సాంకేతిక కారణాన్ని చూపుతూ అనుబంధ పిటిషన్లు వేయడం వల్ల కోర్టు సమయం వృథా అవుతోంది.కేసు దర్యాప్తు చేస్తున్న సీబీఐ , ఈడీ ( లపై కూడా పలు విమర్శలు ఉన్నాయి. విచారణను వేగవంతం చేయడంలో ఈ సంస్థలు విఫలమవుతున్నాయని ఫిర్యాదుదారులు ఆరోపిస్తున్నారు. రాజకీయ ఒత్తిళ్లు లేదా వ్యూహాత్మక జాప్యం వల్లనే సీబీఐ కోర్టులో గట్టిగా వాదనలు వినిపించడం లేదనే అభిప్రాయం రాజకీయ వర్గాల్లో ఉంది.జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పాలనాపరమైన కారణాలను చూపుతూ వ్యక్తిగత హాజరు నుండి మినహాయింపు పొందేవారు. ప్రధాన నిందితులు కోర్టుకు హాజరు కాకపోవడం, వారి తరపు న్యాయవాదులు వాయిదాలు కోరడం వల్ల విచారణ ముందుకు సాగడం లేదు. సీబీఐ కోర్టులో విచారణ జరుగుతున్నప్పుడు, నిందితులు ఉన్నత న్యాయస్థానాలను ఆశ్రయించి స్టే తీసుకురావడం లేదా విచారణపై అభ్యంతరాలు వ్యక్తం చేయడం వల్ల విచారణ ప్రక్రియ నిలిచిపోతోంది. ఒక ఛార్జ్‌షీట్‌పై విచారణ జరుగుతున్నప్పుడు మరొక దానిపై స్టే రావడం వల్ల గందరగోళం ఏర్పడుతోంది.న్యాయమూర్తి కె. పట్టాభిరామారావు బాధ్యతలు చేపట్టడంతో, ఈ కేసు మరోసారి కీలకాంశంగా మారింది. అయితే, కొత్త న్యాయమూర్తి ఈ భారీ కేసును ఎంత వేగంగా అర్థం చేసుకుంటారు, దర్యాప్తు సంస్థలు ఎంతటి సహకారాన్ని అందిస్తాయి అనే దానిపైనే ఈ కేసు భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. సామాన్య ప్రజల్లో న్యాయ వ్యవస్థపై నమ్మకం కలగాలంటే, ఇలాంటి కీలక కేసుల్లో విచారణ కాలపరిమితితో కూడి ఉండాలని న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## ఎడ్యూసిటీకి 1000 కోట్ల భూమి విరాళం

విజయనగరం, డిసెంబర్ 24, విశాఖపట్నం – విజయనగరం సరిహద్దుల్లో ఏవియేషన్ ఎడ్యు సిటీ నిర్మాణానికి వడివడిగా అడుగులు పడుతున్నాయి. దీనికి సంబంధించి ఇటీవలే ఒప్పందం కుదిరింది. జీఎంఆర్ గ్రూప్ – మాన్సాస్ ట్రస్టు ఈ ఏవియేషన్ ఎడ్యుసిటీ ఏర్పాటు చేయనున్నాయి. ఈ నేపథ్యంలో ఈ ప్రాజెక్టు కోసం మాన్సాస్ ట్రస్టు తరుపున రూ.1000 కోట్లు విలువైన 136.63 ఎకరాల భూమిని దానంగా ఇచ్చేందుకు పూసపాటి వంశీయులు అంగీకరించారు. ఈ ప్రాజెక్టుకు తమ వంశీయుడైన అలక్ మహారాజా గజపతి పేరు పెట్టాలని విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు కోరుతున్నారు.పూసపాటి వంశీయులు మరోసారి తమ పెద్ద మనసు చాటుకున్నారు. భావితరాల భవిష్యత్ కోసం సుమారు రూ.1000 కోట్లు విలువైన భూమిని దానంగా అందించారు. విశాఖపట్నం –

విజయనగరం సరిహద్దుల్లోఏవియేషన్ ఎడ్యుకేషన్ సిటీనిర్మాణానికి ఏపీ ప్రభుత్వం సంకల్పించిన సంగతి తెలిసిందే. జీఎంఆర్ గ్రూప్. మాన్సాస్ ట్రస్టు ఈ ప్రాజెక్టును చేపడుతున్నాయి. ఇటీవలే మంత్రి నారా లోకేష్ సమక్షంలో జీఎంఆర్ – మాన్సాస్ ఎడ్యు సిటీ ప్రాజెక్టుకు ఒప్పందం జరిగింది. ఈ ఒప్పందం ప్రకారం 160 ఎకరాల విస్తీర్ణంలో క్యాంపస్ ఏర్పాటు చేయనున్నారు. అయితే ఈ ఏవియేషన్ ఎడ్యు సిటీ కోసం పూసపాటి వంశీయులు రూ.1000 కోట్లు విలువైన భూమిని దానంగా అందించారు.ఈ ఏవియేషన్ ఎడ్యుసిటీ ప్రాజెక్టు కోసం 136.63 ఎకరాలు భూమిని అందించేందుకు మాన్సాస్ ట్రస్టు ముందుకు వచ్చింది. విశాఖ జిల్లా భీమిలి మండలం అన్నవరం వద్ద ఉన్న ఈ భూమిని ఏవియేషన్ ప్రాజెక్టుకు ఇచ్చేందుకు పూసపాటి వంశీయురాలు, అశోక్ గజపతిరాజు కుమార్తె అదితి గజపతిరాజు ముందుకు వచ్చారు. ఈ నేపథ్యంలో జీఎంఆర్ – మాన్సాస్ ఎడ్యు సిటీ ప్రాజెక్టుకు పూసపాటి రాజవంశీయుడైన అలక్ మహారాజా గజపతి పేరు పెట్టాలని అదితి గజపతిరాజు కోరారుమరోవైపు విజయనగరం జిల్లా భోగాపురం వద్దఅల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. ఎయిర్‌పోర్టు నిర్మాణ పనులు కూడా తుది దశకు చేరుకున్నాయి. 2026 మే లేదా ఆగస్ట్ నెలల్లో భోగాపురం ఎయిర్‌పోర్టు నుంచి విమానాల రాకపోకలు ప్రారంభించేందుకు విమానయాన శాఖ చర్యలు చేపడుతోంది. అయితే విమానయాన రంగంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేలా.. భోగాపురం సమీపంలో ఏవియేషన్ ఎడ్యుకేషన్ సిటీని ఏర్పాటుచేయాలని ఏపీ ప్రభుత్వం భావిస్తోంది. ఏవియేషన్ రంగంలో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న యూనివర్సిటీల బ్రాంచ్‌లను ఇక్కడ ఏర్పాటు చేయించాలని లక్ష్యంయా పెట్టుకుంది. ఇందులో భాగంగానే రైతుల వద్ద నుంచి సేకరించిన భూమి లేదా ప్రభుత్వ భూములలో ఈ ఎడ్యు సిటీని ఏర్పాటు చేయాలని తొలుత నిర్ణయం తీసుకుంది.

## సిబిఐ వలలో టిడిపి మాజీ ఎంపీ వారసులు!

తిరుపతి, డిసెంబర్ 24, దివంగత డీకే ఆదికేశవుల నాయుడు పేరు మరోసారి ప్రముఖంగా వినిపించింది. ఆయన వారసులు సిబిఐ వలలో పడ్డారు. 2019లో జరిగిన రియల్టర్ రఘునాథ్ అనుమానాస్పద మృతి కేసులో ఆది కేశవులు కుమారుడు డీకే శ్రీనివాస్, కుమార్తె కల్పజాను సిబిఐ అధికారులు అరెస్టు చేశారు. వీరితోపాటు అప్పటి డిఎస్పి మోహన్ ను కూడా అదుపులో తీసుకున్నారు. రఘునాథ మృతి వెనుక ఆర్థిక లావాదేవీలు, బెదిరింపులు ఉ న్నాయన్న ఆరోపణలపై సుదీర్ఘ దర్యాప్తు కొనసాగింది. అందులో భాగంగానే ఈ అరెస్టులు జరిగాయి. రాజకీయంగా దూరంగా ఉన్న డీకే కుటుంబం ఇప్పుడు ఈ ఘటనతో మళ్లీ వెలుగులోకి వచ్చింది.2019 నాటి కేసు ఇది. డీకే ఆదికేశవులు నాయుడుకు సన్నిహితుడు రఘునాథ్. ఆయన అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. మొదట బెంగళూరు పోలీసులు దర్యాప్తు చేశారు. ఆ తర్వాత బాధితులు హైకోర్టును ఆశ్రయించడంతో దర్యాప్తును సిబిఐ చేశారు. సుప్రీంకోర్టు సైతం సీబీఐ దర్యాప్తునకు ఓకే చెప్పడంతో రంగంలోకి దిగిన అత్యున్నత విచారణ సంస్థ ఈ కేసులో విచారణ చేపట్టింది. అందుకే కీలక అరెస్టులు జరిపినట్లు తెలుస్తోంది. టిటిడి చైర్మన్ పోస్ట్ తో పాటు తిరుపతి ఎంపీగాను పనిచేశారు డీకే ఆదికేశవులు నాయుడు. సుదీర్ఘకాలం టిడిపిలోనే పనిచేశారు.డీకే ఆదికేశవుల నాయుడుకు కర్ణాటకలోవిలువైన ఆస్తులు ఉ ండేవట. బెంగళూరు తో పాటు ఇతర ప్రాంతాల్లో భారీగా ఆస్తులు ఉ ండేవని తెలుస్తోంది. మరోవైపు రఘునాథ్ కూడా బెంగళూరు పరిసర ప్రాంతాల్లో స్థితిమంతుడుగా ఉండేవారు. 2013లో ఆదికేశవులు మృతి చెందిన తర్వాత రఘునాథ్ ఆయనకు చెందిన అనేక ఆస్తులను తన ఆధీనంలోకి తీసుకున్నారు. వాటిని తమ పేర్ల మీద బదలాయించాలని.. తండ్రి ఆస్తులకు తాము వారసులమని అప్పట్లో శ్రీనివాస్, కల్పజ, మరికొందరు రఘునాథ్ తీవ్ర ఒత్తిడి తీసుకొచ్చారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో 2019 మే లో రఘునాథ్ అనుమానాస్పద స్థితి లో మృతి చెందారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు బెంగళూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అయితే నిందితులుగా ఉన్న ఆది కేశవులు వారసులు పోలీసులపై ఒత్తిడి తెచ్చి దర్యాప్తును నీరుగాచుతున్నారని మృతుడి బంధువులు ఆరోపించారు. ఈ కేసును సిబిఐ కి బదలాయించాలంటూ కర్ణాటక కోర్టుకు ఆశ్రయించారు. సిబిఐ రంగంలోకి దిగడంతో వీరి అరెస్టు జరిగింది. డీకే ఆదికేశవులు టిడిపి నుంచి ఎంపీ అయ్యారు. టీటీడీ చైర్మన్ గాను వ్యవహరించారు.

## ఆదిత్య కళాశాల లో ఘనంగా జాతీయ దంత వైద్యుల దినోత్సవం

ఒక మంచి చిరునవ్వు ఆత్మవిశ్వాసానికి చిహ్నం.

.డా అడ్డాల

కాకినాడ, స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలలో జాతీయ దంత వైద్యుల దినోత్సవం సందర్భంగా కాకినాడకు చెందిన డాక్టర్ అడ్డాల సత్యనారాయణ ని కళాశాల కో ఆర్డినేటర్ డా బి ఇ వి ఎల్ ఎన్ నాయుడు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. డాక్టర్ నాయుడు మాట్లాడుతూ "డా అడ్డాల సత్యనారాయణ కేవలం దంత వైద్యునిగానే కాకుండా, సామాజిక కార్యకర్తగా అనేక సేవలు అందిస్తూ గుర్తింపు పొందారని,మన రాష్ట్ర ప్రభుత్వం చే ఉత్తమ దంత వైద్యుని పురస్కారం రెండు పర్యాయాలు అందుకున్నారని , ?డాక్టర్ అడ్డాల లయన్స్ క్లబ్, రోటరీ క్లబ్ మరియు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వంటి సంస్థల ద్వారా 3000కి పైగా ఉచిత ఆరోగ్య శిబిరాలను నిర్వహించారని , 27 ఏళ్లకు పైగా దంత వైద్య రంగంలో అనుభవం ఉన్న ఆయన, గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని అందించడంలో ముందుంటారని ,? వైద్య వృత్తితో పాటు పర్యావరణ పరిరక్షణ,పొగాకు రహిత సమాజం పట్ల ఆయన చూపిన చొరవ, కేన్సర్ నివారణ అవగాహన శిబిరాలు ,రక్తదాన అవగాహన మరియు విద్యార్థులకు దిశానిర్దేశం చేసే కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటారని, మన భారతదేశంలో దంతవైద్యుల దినోత్సవాన్ని డిసెంబర్ 24న జరుపుకుంటారని ,ప్రతి ఒక్కరి ముఖంలో అందమైన చిరునవ్వును నింపే దంతవైద్యులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు అని అన్నారు.డా అడ్డాల మాట్లాడుతూ ?మన ఆరోగ్యంలో కీలక పాత్ర పోషించే ?నోటి ఆరోగ్యం పట్ల ప్రజల్లో అవగాహన కల్పించడం ,?దంత సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా క్రమం తప్పకుండా చెకప్ చేయించుకోవాలని గుర్తు చేయడం, ఈ రోజు యొక్క ముఖ్య ఉద్దేశం అని అన్నారు.

## శ్రీ లక్ష్మీనరసింహా స్వామి పారువేట ఉత్సవం---

### ఎన్ఎండి ఫయాజ్‌కు ఆహ్వానం--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబర్ 24:నంద్యాలలో శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారి పారువేట ఉత్సవ శోభాయాత్రకు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్‌ను "మన ఊరు ? మన గుడి ? మన బాధ్యత" సంస్థ, ఇంటాక్ ప్రతినిధులు బాబురావు, శేఖర్ మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా నంద్యాల టిడిపి కార్యాలయంలో ఆయనకు ఆహ్వాన పత్రిక అందజేశారు.వారు మాట్లాడుతూ ఈనెల 26-12-2025 శుక్రవారం ఉదయం 9 గంటలకు ఆత్మకూరు బస్టాండ్ సమీపంలోని శ్రీ లక్ష్మి గణపతి ఆలయం నుంచి పారువేట ఉత్సవ శోభాయాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు. సంప్రదాయబద్ధంగా నిర్వహించే ఈ ఉత్సవంలో చెంచులు విల్లు, బాణాలతో స్వామివారి పల్లకీని స్పృశించే ఘట్టం ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో నంద్యాల మూలమట్టం చైర్మన్ పసుపులేటి నారాయణ, నంద్యాల మార్కెట్ యార్డ్ డైరెక్టర్ స్వామి నాయక్, తోట రామయ్య, పుండరీకాక్ష రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వైకుంఠ ఏకాదశికి మహానందిలో ప్రత్యేక పూజలు--




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబర్ 24-:డిసెంబరు 30వైకుంఠ ఏకాదశి సందర్భంగా మంగళవారం మహానంది క్షేత్రంలో శ్రీ సీతాలక్ష్మణ హనుమత్సమేత కోదండరామ స్వామి వారికి ప్రత్యేక పూజలు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎన్ శ్రీనివాసరెడ్డి తెలిపారు.తెల్లవారుజామున 4 గంటలకు ప్రత్యేక అభిషేకాల అనంతరం ఉత్తర ద్వార పూజలు, తిరుప్పావై సేవలు జరుగుతాయి. అనంతరం కోదండరామాలయంలో సుమారు 500 కిలోల పుష్పాలతో లక్ష పుష్పార్చన నిర్వహిస్తారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి అనుగ్రహం పొందాలని కోరారు.ఈ కార్యక్రమాలపై మాజీ పార్లమెంటు సభ్యులు పోచ బ్రహ్మానందరెడ్డితో ఈఓ చర్చించారు. ఆలయ అభివృద్ధిలో భాగంగా వసతి గృహాల ఏర్పాటుకు సహకరించాలని కోరినట్లు తెలిపారు.

## రబీకి నంద్యాల జిల్లాలో యూరియా సమృద్ధి--

### జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబరు 24:నంద్యాల జిల్లాలో రబీ 2025?26 సీజన్‌కు అవసరమైన యూరియా ఎరువులు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్నాయని జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సీజన్‌కు జిల్లాకు మొత్తం 68,777 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీకి ప్రణాళిక రూపొందించినట్లు పేర్కొన్నారు.అక్టోబర్ 1 నుంచి డిసెంబరు 24 వరకు 30,059 మెట్రిక్ టన్నుల అవసరం ఉండగా, ఇప్పటికే 36,914 మెట్రిక్ టన్నుల యూరియా రైతులకు అందుబాటులో ఉంచామని తెలిపారు. ప్రస్తుతం కోఆపరేటివ్ సొసైటీలు, ఆర్ఎస్‌కేలు, మార్క్‌ఫెడ్ గోదాములలో సహా వివిధ కేంద్రాల్లో 13,865 మెట్రిక్ టన్నుల నిల్వలు ఉన్నాయని వెల్లడించారు.జిల్లాలో ఎక్కడా ఎరువుల కొరత లేదని, రాబోయే రోజుల్లో కూడా యూరియా సమస్య ఉండదని స్పష్టం చేశారు. రైతులు ఎరువులు కొనుగోలు సమయంలో ఎంఆర్‌పీ ధర మేరకే చెల్లించి, రసీదు తప్పనిసరిగా పొందాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే డీలర్లపై ఎరువుల నియంత్రణ చట్టం?1985 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.




## ఆరుతడి పంటలకు మద్దతు ధర--

### బొజ్జా దశరథరామిరెడ్డి--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబర్ 24 :-కంది పంటను కనీస మద్దతు ధరకు కొనుగోలు చేయడానికి కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎన్‌సీసీఎఫ్ ముందుకు రావడాన్ని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి స్వాగతించారు.బుధవారం నంద్యాలలో నిర్వహించిన పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఉమ్మడి కర్నూలు జిల్లాలో సుమారు 40 వేల టన్నుల కందుల కొనుగోలు నిర్ణయం రైతులకు ఉపశమనమని పేర్కొన్నారు. జిల్లాలో దాదాపు 4 లక్షల ఎకరాల్లో కంది సాగు జరుగుతుండగా సుమారు 1.60 లక్షల టన్నుల ఉత్పత్తి అంచనా ఉందని తెలిపారు. ప్రస్తుత నిర్ణయంతో ఉత్పత్తిలో 25 శాతం మాత్రమే కొనుగోలు జరిగే పరిస్థితి ఉందని చెప్పారు.కోస్తా ప్రాంతాల్లో వరిని పూర్తిగా కనీస మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నట్టుగానే, రాయలసీమలో మొక్కజొన్న, శనగ, కంది, మినుము, పెసలు, జొన్నలు, చిరుధాన్యాలు సహా అన్ని ఆరుతడి పంటలను కూడా కనీస మద్దతు ధరకు కొనుగోలు చేసే స్పష్టమైన కార్యాచరణను ప్రభుత్వం ప్రకటించాలని డిమాండ్ చేశారు.ప్రస్తుతం మొక్కజొన్న మద్దతు ధర కంటే తక్కువ ధరకు అమ్ముడవుతున్నా ఇప్పటివరకు కొనుగోలు ప్రారంభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే రాయలసీమ, ప్రకాశం జిల్లాల్లో శనగలు గోడౌన్లలో నిల్వ ఉన్నా వాటిని మద్దతు ధరకు కొనుగోలు చేయడం లేదని తెలిపారు. తక్షణమే అన్ని ఆరుతడి పంటల కొనుగోలుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో రాయలసీమ సాగునీటి సాధన సమితి ఉపాధ్యక్షులు యర్రం శంకర రెడ్డి, ప్రచార కార్యదర్శి నిట్టూరు సుధాకర్ రావు పాల్గొన్నారు.

## క్రిస్మస్,న్యూ ఇయర్ వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి.

### - జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్.

విభారే న్యూస్ డిసెంబర్ 24 కర్నూలు జిల్లా ప్రతినిధి..క్రిస్మస్,న్యూ ఇయర్ నేపథ్యంలో భద్రతకు సంబంధించిన అంశాల పై కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ డ్పోలీసు అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. డిసెంబర్ 31వేడుకల్లో ప్రధాన కూడళ్లలో డ్రంకెన్ డ్రైవ్,ఆకస్మిక తనిఖీలతోపాటు నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించాలని పోలీసు అధికారులకు సూచించారు.వేడుకల నేపథ్యంలో కొందరు ఆకతాయిలు రోడ్ల పై హంగామా చేసి ఇతరులకు ఇబ్బందులు కలిగిస్తే సహించేది లేదన్నారు.న్యూ ఇయర్ స్వాగతపు వేడుకలను ఆనందంగా జరుపుకోవాలన్నారు.మద్యం సేవించి అత్యుత్సాహంతో హద్దు మీరి, చట్టపరమైన కష్టాలను తెచ్చుకోవద్దన్నారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతూ సామాన్య ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే చట్టపరంగా చర్యలు తప్పవన్నారు. వేడుకలను కుటుంబ సమేతంగా,ఇళ్లలో సంతోషంగా నిర్వహిం చుకోవాలన్నారు.మద్యం సేవించి వాహనాలు నడపడం, ట్రిపుల్, ర్యాష్ డ్రైవింగ్ , రాంగ్ రూట్ డ్రైవింగ్, రోడ్లుపై వెళ్ళేవారిని ఇబ్బందికి గురి చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.సైలెన్సర్లు తీసి ద్విచక్ర వాహనాలు నడపడం చేస్తూ శబ్ద కాలుష్యం చేసే వారి పై కఠినంగా వ్యవహరించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమన్నారు. ద్విచక్ర వాహనాలు నడిపే యువకులకు హెల్మెట్ లేకుండా బయటకు పంపించరాదని, లైసెన్సులు లేని మైనర్లకు వాహనాలు ఇచ్చి బయటకు పంపించి తల్లిదండ్రులు ఇబ్బందులు పడవద్దన్నారు.రహదారి భద్రత నిబంధనలు ఉల్లంఘించి రోడ్డు ప్రమాదాల బారిన పడవద్దన్నారు.ఆయా కళాశాలలు, పాఠశాలల యాజమాన్యాలు హాస్టల్స్ లలో ఉంటున్న విద్యార్థుల పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.పోలీసు అధికారులకు, జిల్లా ప్రజలకు, సిబ్బందికి జిల్లా ఎస్పీ క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.ప్రజలు ఆనందంగా న్యూ ఇయర్ వేడుకలు జరుపుకోవాలని,చట్టాన్ని గౌరవిస్తూ బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ తెలిపారు.



## రూ.1 లక్ష 34 వేల విలువైన బయో ఉత్పత్తుల అమ్మకాలు నిలిపివేత--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబర్ 24నంద్యాల జిల్లా కేంద్రంలోని పలు ఎరువులు, పురుగుమందుల దుకాణాలను జిల్లా వ్యవసాయ అధికారి నున్నా వెంకటేశ్వర్లు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.శివ సంతోష్ రెడ్డి ఏజెన్సీస్, దుర్గా భవాని ఫెర్టిలైజర్స్ దుకాణాల్లో స్టాక్ రిజిస్టర్లు, బిల్లులు, రసీదులు, బయో ఉత్పత్తుల అనుమతి పత్రాలు, యూరియా నిల్వలు, రోజువారీ అమ్మకాలను పరిశీలించారు. యూరియా వివరాలను ప్రతిరోజూ వ్యవసాయ శాఖ బోర్డులో నవీకరించాలని సూచించారు. జిల్లాలో యూరియా నిల్వలు సరిపడా ఉన్నాయని తెలిపారు. ఎంఆర్‌పీ కంటే అధిక ధరకు యూరియా విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.సరైన ధృవపత్రాలు లేనందున సుమారు రూ. 1 లక్ష 34 వేల విలువైన బయో ఉత్పత్తుల అమ్మకాలను తాత్కాలికంగా నిలిపివేశారు. ప్రభుత్వం అనుమతిచ్చిన బయో ఉత్పత్తులనే విక్రయించాలని, అవసరమైన అన్ని ధృవపత్రాలు సక్రమంగా నిర్వహించాలని జిల్లా వ్యవసాయ అధికారి సూచించారు. లేనిచో ఎఫ్‌సీఓ 1985 చట్టం ప్రకారం దుకాణాల లైసెన్సు రద్దుకు సిఫార్సు చేస్తామని స్పష్టం చేశారు.ఈ తనిఖీల్లో నంద్యాల మండల వ్యవసాయ అధికారి ప్రసాద్ రావు, సాంకేతిక వ్యవసాయ అధికారి నిరంజన్ పాల్గొన్నారు.



## సిపిఐ 101వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి--




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబర్ 24 :భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) 101వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఈ నెల 26న ఘనంగా నిర్వహించాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్. బాబా ఫక్రుద్దీన్, సిపిఐ నంద్యాల పట్టణ కార్యదర్శి కె. ప్రసాద్ పిలుపునిచ్చారు.నంద్యాల సిపిఐ కార్యాలయంలో సిపిఐ పట్టణ కౌన్సిల్ సభ్యుల సమావేశం పట్టణ సహాయ కార్యదర్శి లక్ష్మీదేవి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో మాట్లాడిన నాయకులు, అన్ని శాఖలలో పతాక ఆవిష్కరణలు నిర్వహించి పార్టీ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జరపాలని తెలిపారు.1925 డిసెంబర్ 26న ఆవిర్భవించిన సిపిఐ దేశంలో కార్మికులు, రైతులు, పేదల హక్కుల కోసం అనేక పోరాటాలు నిర్వహించిందని చెప్పారు. తెలంగాణ సాయుధ పోరాటంలో సిపిఐ కీలక పాత్ర పోషించి వేలాది గ్రామాల విముక్తికి దోహదపడిందని గుర్తు చేశారు.ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జి. నాగరాముడు, జిల్లా నాయకులు పి. మురళీధర్, పట్టణ సహాయ కార్యదర్శులు భూమని శ్రీనివాసులు, లక్ష్మీదేవి, ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి డి. శ్రీనివాసులు, మహిళా సమాఖ్య పట్టణ కార్యదర్శి సుశీలమ్మతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు

## అంగళ్లు తొలగించవద్దు---

### మంత్రి ఎన్ ఎమ్ డి ఫరూక్ కు వినతి---

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబర్ 24 :-నూనెపల్లె బ్రిడ్జి కింద ఎన్నో ఏళ్లుగా జీవనం సాగిస్తున్న పేదల అంగళ్లు తొలగించవద్దని సిపిఎం జిల్లా మాజీ నాయకులు, ఆవాజ్ జిల్లా



కార్యదర్శి మస్తాన్వలి రాష్ట్ర న్యాయశాఖ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ ఎం డి ఫరూక్ కు విజ్ఞప్తి చేశారు.బ్రిడ్జి కింద చిన్న దుకాణాలు పెట్టుకొని ముస్లింలు, క్రిస్టియన్లు, దళితులు, బడుగు బలహీన వర్గాల ప్రజలు జీవనం సాగిస్తున్నారని తెలిపారు. అంగళ్లు తొలగిస్తే వందల కుటుంబాలు ఉపాధి కోల్పోతాయని అన్నారు.పేదలకు ఇబ్బంది కలగకుండా అంగళ్లు యథాతథంగా కొనసాగించేలా మున్సిపల్ అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని మంత్రి ఫరూక్ ను కోరారు.

## భాష్యం స్కూల్లో ముందస్తు క్రిస్మస్ వేడుకలు.

విభారే న్యూస్ డిసెంబర్ 24 ఎమ్మిగనూరు..భాష్యం విద్యాసంస్థల చైర్మన్ రామకృష్ణ, డైరెక్టర్ హనుమంతరావు, జెడ్ఈఓ మాచాని కవిత ఆదేశాల మేరకు ప్రిన్సిపల్ నాగరాజు భాష్యం స్కూల్లో ముందస్తు క్రిష్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్ఈఓ మాచాని కవిత మాట్లాడుతూ క్రిస్మస్ అంటే దేవుని కుమారుడైన జీసస్ జననం క్రైస్తవులు జరుపుకునే పండగలలో సాంస్కృతిక, మతపరమైన పండుగలలో అతిపెద్ద పండుగ అని ఇది ఏసుక్రీస్తు జన్మదినాన్ని జరుపుకుంటుందని ఇది ప్రతి సంవత్సరం డిసెంబర్ 25వ తేదీన జరుపుకుంటారని. రోమన్ క్యాథలిక్ చర్చి యేసు జన్మదినాన్ని గుర్తు చేసుకోవడానికి ఎంచుకున్న రోజని అదేవిధంగా ఏసుక్రీస్తు మహిమలను గురించి కవిత విద్యార్థులకు తెలియజేయడం జరిగింది. ఇందులో హెచ్ ఎం అనురాధ, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.





EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190